చిట్టి చేతలు..!

సృజనకు ప్రాణం.. స్వయం ఉపాధికి సోపానం



7

గందరగోళం..!

- మాక్ అసెంబ్లీకి ఎంపికలో తికమక
- అధికారులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



డీఈఓ కార్యాలయానికి వచ్చిన టీచర్లు, విద్యార్థిని అలేఖ్య

అనంతపురం విద్య, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీకి విద్యార్థుల ఎంపికలో గందరగోళం నెలకొంది. నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు చోటు దక్కలేదంటూ వారి తల్లిదండ్రులు ఆవేదన చెందారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో రాష్ట్ర ప్రభుత్వం మాక్ అసెంబ్లీ నిర్వహిస్తోంది. ఇందుకోసం రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం నుంచి ఒక విద్యార్థికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. ప్రత్యేక పరీక్ష నిర్వహించి, నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థిని ఎంపిక చేశారు. అలేఖ్య (అనంతపురం),వీభాకర్వా(గుంతకల్లు), అభిజ్ఞ (కళ్యాణదుర్గం), శ్రీనిత్‌రెడ్డి (రాప్తాడు), హేమలత (రాయదుర్గం), దీక్షిత (శింగనమల), నాగమల్లికార్జున (తాడిపత్రి), లహరి (ఉరవకొండ) ఆయా నియోజకవర్గాల నుంచి మొదటిస్థానంలో ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి జాబితాలను పంపారు. ఆ తర్వాత రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రతి నియోజకవర్గం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన విద్యార్థుల వివరాలు పంపాలని ఆదేశాలు పంపారు. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ మళ్లీ వివరాలు సేకరించి, పంపింది. అందులో నుంచి విద్యార్థులను ఎంపిక జాబితాను రాష్ట్ర శాఖ పంపింది. అందులో నియోజకవర్గ స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థుల పేర్లు లేవు. ఒకరిద్దరివి మాత్రమే ఉన్నాయి. విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు నిరాశకు లోనయ్యారు. దీనిపై విద్యాశాఖాధికారులను నిలదీస్తున్నారు. 'ఇది రాష్ట్రశాఖ నుంచి వచ్చిన జాబితా అనీ, కుల ప్రాతిపదికన తీసుకోవడంతో ఇలా జరిగింద'ని విద్యాశాఖ యంత్రాంగం చెబుతోంది. అలాంటపుడు ఆ రోజే ఏ నియోజకవర్గంలో ఏ కేటగిరీ విద్యార్థిని ఎంపిక చేయాలో నిర్ణయించి తీసుకోవాల్సిందని నిలదీస్తున్నారు.

ప్రత్యామ్నాయంవైపు అధికారుల చూపు

నియోజకవర్గస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి మొదటిస్థానంలో నిలిచిన విద్యార్థులకు మాక్ అసెంబ్లీకి అవకాశం రాకపోవడం వివాదంగా మారింది. హెచ్‌ఎం, టీచర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు.. అధికారుల తీరును తప్పుబడుతున్నారు. ఈనేపథ్యంలో అధికార యంత్రాంగం.. జరిగిన తప్పు నుంచి బయటపడడానికి కొత్త ఎత్తు వేస్తోంది. అమరావతిలో మాక్ అసెంబ్లీ నిర్వహించే రోజే.. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి అవకాశం దక్కని విద్యార్థులను కలెక్టరేట్‌కు పిలిపించి సత్కరించాలని నిర్ణయించింది. ఇదే విషయాన్ని డీఈఓ ప్రసాద్‌బాబు.. ఆయా విద్యార్థులు, టీచర్లకు చెప్పి కొంతమేర సంతృప్తి పరుస్తున్నారు.

మాక్ అసెంబ్లీకి బయల్దేరిన విద్యార్థులు



అమరావతికి వెళ్తున్న విద్యార్థులతో డీఈఓ

అనంతపురం విద్య, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మాక్ అసెంబ్లీకి ఎంపికైన 8 మంది విద్యార్థులు అమరావతికి బయలుదేరి వెళ్లారు. శనివారం సాయంత్రం ధర్మవరం-మచిలీపట్నం రైలుకు విద్యార్థులు వెళ్లారు. వారి వెంట ఓ మహిళ, పురుష టీచర్ వెళ్లారు. ఆదివారం వారు అమరావతికి చేరుకుని, మాక్ అసెంబ్లీ నిర్వహణపై మూడురోజులపాటు శిక్షణ ఇస్తారు. ఈనెల 26న మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొంటారు. డీఈఓ ప్రసాద్‌బాబు స్వయంగా రైల్వేస్టేషన్‌కు వెళ్లి విద్యార్థులను అమరావతికి పంపారు.

వందేళ్ల ప్రేమ

నేడు సత్యసాయి బాబా శత జయంతి

- వేడుకలకు ముస్తాబైన హిల్‌వ్యూ స్టేడియం
- పాల్గొననున్న ఉపరాష్ట్రపతి, తెలుగు రాష్ట్రాల సీఎంలు








అలంకరణలో బాబా మహాసమాధి

పుట్టపర్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు పుట్టపర్తిలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక కేంద్రం అందంగా ముస్తాబైంది. ఇప్పటికే దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన సాయి భక్తులతో పుట్టపర్తిలో సందడి నెలకొంది. రాష్ట్ర ప్రభు త్వం, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పుట్టపర్తిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు ఈనెల 13న ప్రారంభంకాగా ఇప్పటికే ప్రధాని, రాష్ట్రపతి, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, దేశవిదేశాల నుంచి వచ్చిన లక్షల మంది భక్తులు పుట్టపర్తిని సందర్శించారు. పుట్టపర్తి హిల్‌వ్యూ స్టేడియం సత్యసాయి శతజయంతి వేడుకలకు వేదిక కానుంది. ఉదయం 9 నుంచి 11 గంటల దాకా నిర్వహించే వేడుకల్లో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి నారాలోకేశ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సేవాదళ్ కార్యకర్తలు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో హిల్‌వ్యూ స్టేడియాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. స్టేడియంలో వేల మంది ఉత్సవాలు వీక్షించేలా అతి పెద్ద స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు.



విశ్వప్రేమకు ప్రతిరూపం.. సత్యసాయి

- ఆయన బోధనలు మానవాళికి పాఠాలు
- శత జయంతి వేడుకలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



పంచ సూత్రాలతో ప్రపంచ శాంతి

- శత జయంతి వేడుకలలో సీఎం చంద్రబాబు

(మెయిన్‌లో..)

విలువలతో కూడిన విద్య

సత్యసాయి వర్సిటీ ప్రత్యేకత



- ధైర్యానికి, త్యాగానికి, ఆధ్యాత్మికతకు ప్రతీక రాయలసీమ
- మంత్రి నారా లోకేశ్

మీరే మార్గదర్శకులు

సత్యసాయి సేవలను విశ్వవ్యాప్తం చేయండి

ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

- ఘనంగా శ్రీసత్యసాయి వర్సిటీ 44వ స్నాతకోత్సవం



మెయిన్‌లో..

నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌లు

గుంతకల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వెయిటింగ్ లిస్టు ప్రయాణికుల సౌకర్యార్థం బెంగళూరు-నాందేడ్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌లను వేసి పంపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ప్రకటనలో తెలిపారు. కేఎస్‌ఆర్ బెంగళూరు-హజ్రత్ సాహెబ్ నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (నం. 16593)కు డిసెంబరు 1వ తేదీ నుంచి జనవరి 15 వరకూ ఒక ఏసీ త్రీటైర్, ఒక స్లీపర్, ఒక జనరల్ కోచ్‌ను అదనంగా జతచేసి పంపనున్నట్లు తెలియజేశారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 16594)కు డిసెంబరు 3 నుంచి జనవరి 17వ తేదీ వరకూ ఒక్కో ఏసీ త్రీటైర్, స్లీపర్, జనరల్ కోచ్‌లను చేర్చి నడపనున్నట్లు వివరించారు.

రైళ్ల రద్దు

పాతకొత్తచెరువు-గుత్తి-జక్కలచెరువు రైల్వే సెక్షన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో వెళ్లే రెండు ప్యాసింజరు రైళ్లను రద్దుచేసినట్లు రైల్వే అధికారులు తెలియజేశారు. డోన్-గుత్తి-డోన్ మధ్యన నడిచే ప్యాసింజరు (నం. 77205/06) రైలును ఈనెల 26వ తేదీన రద్దు చేశామన్నారు. గుంతకల్లు-హిందూపురం-గుంతకల్లు మధ్య నడిచే ప్యాసింజరు (నం. 77213/14) రైలును ఈనెల 26వ తేదీన గుత్తి మీద కాకుండా వెంకటాంపల్లి, ఖాదర్‌పేట్ స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలియజేశారు. ఈ కారణంగా హిందూపురం ప్యాసింజరు రైలు తిమ్మనచెర్ల, నక్కనదొడ్డి, పాతకొత్తచెరువు, గుత్తి, తురకపల్లి, పామిడి స్టేషన్లను తప్పించి, గూళ్యపాళ్యం, వెంకటాంపల్లి, ఇమాంపురం, ఖాదర్‌పేట్ స్టేషన్ల మీదుగా నడుపుతామన్నారు.

కలబురగికి ప్రత్యేక రైలు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బెంగళూరు-కలబురగి (గుల్బర్గ) మధ్య (వయా గుంతకల్లు) 12 సింగిల్ ట్రిప్పుల ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ప్రకటనలో తెలిపారు. బెంగళూరు కంటోన్మెంటు-కలబురగి (నం. 06207) ప్రత్యేక వీక్లీ రైలును ఈ నెల 22వ తేదీ నుంచి డిసెంబరు 23 వరకూ నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు పేర్కొన్న తేదీల మధ్య ఆరు శనివారాల్లో సాయంత్రం 7.20 గంటలకు బెంగళూరు కంటోన్మెంటులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.30కి కలబురగికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06208) ఈ నెల 23 నుంచి డిసెంబరు 28వతేదీ వరకూ ఆరు ఆదివారాల్లో ఉదయం 9.35 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 8.30కి బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాదగిరి, షంషాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.



రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్



అనంతపురం కలెక్టరేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆనంద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీకి సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు.

వక్కల లెక్క తేలేనా..?

- భారీ జరిమానా విధించడానికి రంగం సిద్ధం
- కిలో ధర తేల్చడానికి కర్ణాటకకు శాంపిళ్లు
- మూడు లారీల్లోనే వక్కలు... మరో లారీలో గుట్కా
- దృష్టి సారించిన పన్నుల శాఖ కమిషనర్



ఇటీవల పట్టుబడిన వక్కల లోడు, వక్కలు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వక్కల అక్రమ రవాణాకు సంబంధించి భారీ స్థాయిలో జరిమానా విధించడానికి పన్నుల శాఖ అధికారులు రంగం సిద్ధం చేశారు. అయితే వక్కల అసలు ధర ఎంతనే విషయంపై స్పష్టత కోసం శాంపిళ్లను కర్ణాటకలోని తుమకూరుకు పంపారు. ఈనెల 18న గుత్తి టోల్‌గేట్ సమీపంలో నాలుగు వక్క లారీలు పట్టుబడిన విషయం తెలిసిందే. దాదాపు రూ.4కోట్ల నుంచి రూ.5కోట్ల విలువ చేస్తాయని పన్నుల శాఖ అధికారులు భావిస్తున్నారు. ఒక్కో వాహనంలో 20 నుంచి 22 టన్నుల వక్కలు తరలిస్తున్నట్లు సమాచారం. సాధారణంగా వక్కలు రకాలను బట్టి కిలో రూ.250 నుంచి రూ.450ల వరకు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం తరలిస్తున్న వక్కల ధర ఎంతో తెలియాల్సి ఉంది. ఇప్పటికే ఆ వాహనాలను పాతూరు, గార్లదిన్నె, గుత్తి పోలీస్‌స్టేషన్లలో ఉంచారు. సంబంధిత అధికారులకు వేర్వేరుగా బాధ్యతలు అప్పగించారు. కాగా పట్టుబడిన నాలుగు లారీల్లో మూడింటిలో వక్కలు తరలిస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. నాలుగో వాహనంలో పెద్ద మొత్తంలో గుట్కా తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. వక్కలకు సంబంధించి వే బిల్లులు లేకపోవడం గమనార్హం. వక్కల మాటున తరచుగా గుట్కా రవాణా చేస్తున్నట్లు సమాచారం.

బిల్లుల జనరేషన్‌లో ఆలస్యం

జీఎస్టీ ఎగవేసి వక్కలు అక్రమంగా తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కర్ణాటక నుంచి తరచూ ఢిల్లీకి వక్కలు అక్రమంగా తరలిస్తుంటారు. ఈ క్రమంలో జిల్లాలో కొన్ని ప్రాంతాల మీదుగా రవాణా చేస్తుంటారు. జిల్లాలో కొందరు అధికారులకు సైతం నెలవారీ ముడుపులు అందుతున్నట్లు సమాచారం. తాజాగా అధికారుల తనిఖీలు చేయడానికి కూడా ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలే కారణమని సమాచారం. పట్టుబడిన సమయంలో వక్కల రవాణాకు సంబంధించి వే బిల్లులు చూపలేదు. కొన్ని గంటలు ఆలస్యంగా వేబిల్లు జనరేట్ చేశారు. వాస్తవానికి కర్ణాటక నుంచి బయలుదేరే సమయంలోనే వేబిల్లు ఉండాలి. జిల్లాలోకి ప్రవేశించే సమయానికి రెండు టోల్‌గేట్లు దాటి గుత్తి టోల్‌గేట్ వద్ద పట్టుబడ్డాయి. ఈ రవాణా విషయంపై పన్నుల శాఖ కమిషనర్ బాబు దృష్టి పెట్టినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సరుకు విలువ చెల్లించమంటారా..? జరిమానా విధిస్తారా? అనేది త్వరలోనే తేలనుంది.

కారు ఢీకొని గొర్రెల మృతి

ఫిర్యాదు చేయకుండా పంచాయితీ?



రోడ్డుపై గొర్రెల కళేబరాలు

బొమ్మనహాళ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామ సమీపాన శుక్రవారం రాత్రి కారు ఢీకొని 10 గొర్రెలు మృతి చెందగా.. మరో 15 గాయపడ్డాయి. దీంతో బాధితుడికి దాదాపు రూ.5లక్షలు నష్టం వాటిల్లింది. కర్ణాటక రాష్ట్రంలోని కూడ్లిగి తాలూక తిప్పకనహళ్లికి చెందిన గోవిందప్ప తన 300 గొర్రెలను తోలుకుని శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో కర్ణాటకలోని మోకా వైపు నేమకల్లు మీదుగా బయల్దేరాడు. ఎదురుగా వచ్చిన ఓ కారు అతివేగంతో గొర్రెల మీదకు దూసుకెళ్లింది. దీంతో 10 గొర్రెలు మృతి చెందగా.. 15 గాయపడ్డాయి. బాధితుడు.. పోలీసులను ఆశ్రయించేందుకు యత్నించగా.. కొందరు వైసీపీ, టీడీపీ నాయకులు అడ్డుకున్నట్లు తెలిసింది. ఈ ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. ప్రమాదానికి కారణమైన కారు.. వైసీపీకి చెందిన మాజీ ఎంపీకి చెందినదని విశ్వసనీయంగా తెలిసింది. కారు డ్రైవర్ మాత్రమే నేమకల్లు క్రాస్‌కు వచ్చి అక్కడి నుంచి డీ హిరేహాళ్ వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మాజీ ఎంపీ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ, టీడీపీ నాయకులు పంచాయితీ నిర్వహించి, రూ.1.50 లక్షలకు మాఫీ చేసినట్లు తెలిసింది. బాధితుడికి రూ.5లక్షల మేర నష్టం వాటిల్లగా.. అందులో కంటితుడుపు చర్యగా రూ.1.50 లక్షలు ఇచ్చేలా చేయడంతో లబోదిబోమంటున్నాడు. 'ఇచ్చేది ఇంతేనం'టూ బలవంతంగా ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై బొమ్మనహాళ్ ఎస్‌ఐ నబీరసూల్‌ను వివరణ కోరగా.. గొర్రెలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు తెలిసిందనీ, బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదన్నారు. ప్రమాదం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

గ్రామ సభలపై అశ్రద్ధ

- 361 గ్రామ పంచాయతీల్లోనే నిర్వహణ
- తొలగింపు జాబ్ కార్డుల రీవెరిఫికేషన్‌లో నిర్లక్ష్యం
- అధికారుల పర్యవేక్షణాలోపమే కారణం

అనంతపురం అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామసభలు నిర్వహించడంలో పలువురు డ్వామా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించారని ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఉపాధి కూలీల ఈకేవైసీలో భాగంగా తొలగించిన జాబ్ కార్డులు, కూలీలపై రీ వెరిఫికేషన్ కోసం గ్రామ సభలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో గ్రామ సభలు నిర్వహించడంలో పలువురు డ్వామా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించారు.

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా గ్రామ సభలు నిర్వహించాలని డ్వామా యంత్రాంగం ఆదేశించింది. జిల్లాలో 578 గ్రామ పంచాయతీలు ఉండగా.. 361 గ్రామ పంచాయతీల్లో మాత్రమే గ్రామ సభలు నిర్వహించారు. మిగిలిన వాటిలో గ్రామ సభలు నిర్వహించలేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత క్లస్టర్ ఏపీడీలు, మండల అధికారుల పర్యవేక్షణలోపమే ఇందుకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి.

తొలగింపు జాబ్ కార్డుల రీవెరిఫికేషన్‌లో నిర్లక్ష్యం

ఉపాధి పనుల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్) విధానం అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉపాధి కూలీలతో ఈకేవైసీ చేయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 526534 మంది ఉపాధి కూలీలు ఉన్నట్లు జాబితాలో చేర్చారు. ఇందులో ఇప్పటి దాకా 412361 మందితో (78.35) ఐరిష్ సేకరణ పూర్తి చేశారు. ఇంకా 1.14 లక్షల మంది పెండింగ్ జాబితాలో ఉన్నారు. ఈకేవైసీలో భాగంగా జిల్లాలోని 15787 జాబ్ కార్డుల్లోని 21737 ఉపాధి కూలీలను తొలగించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. జాబ్ కార్డులు, కూలీల రీవెరిఫికేషన్‌లో పలు గ్రామ పంచాయతీల్లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం 6 గంటలదాకా 8153 జాబ్ కార్డుల్లోని 10678 ఉపాధి కూలీల జాబితాను రీవెరిఫికేషన్ చేశారు. ఇంకా 11059 కూలీల వివరాలను రీవెరిఫికేషన్ చేయాల్సి ఉంది. అలాగే 2711 మంది కూలీల వివరాలను రీ యాక్టివేషన్ చేశారు. మరో 7967 మంది కూలీలను రీయాక్టివేషన్ చేయాలని నిర్ణయించారు. అయితే ఆయా కూలీల రీయాక్టివేషన్ ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. సంబంధిత క్లస్టర్ ఏపీడీలు, మండల అధికారులు ముందస్తు ప్రణాళికల లోపంతోనే పలు పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించకపోవడంతో రీవెరిఫికేషన్ సరిగా జరగలేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



గుత్తి రూరల్ మండలంలో ఈకేవైసీపై గ్రామ సభ

సమాచారం ఇవ్వడంలోనూ అదేతీరు

గ్రామ సభల్లో వచ్చిన అర్జీల వివరాలను డ్వామా పీడీ కార్యాలయానికి అందించడంలోనూ పలు మండలాల అధికారులు నిర్లక్ష్యం వహించినట్లు సమాచారం. తొలగించిన జాబితాపై రీవెరిఫికేషన్ డేటా ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. గ్రామ సభల్లో రీవెరిఫికేషన్‌తోపాటు కొత్త జాబ్ కార్డుల కోసం అర్జీలు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 9382 మంది కొత్త జాబ్ కార్డులు కావాలని అర్జీలు ఇచ్చినట్లు సమాచారం. అలాగే డబుల్ ఎంట్రీలు, మరణించిన వ్యక్తుల పేర్లను తొలగించాలని అభ్యంతరాలు వచ్చాయి. ఆ వివరాలను పీడీ కార్యాలయానికి సమర్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆ వివరాలు పూర్తిస్థాయిలో ఇంకా పీడీ కార్యాలయానికి అందలేదని సమాచారం.

వైట్‌కాలర్ ఉద్యోగులతో పోల్చడమా..?

- ఏపీ హంస అధ్యక్షుడు అరవపాల్

అనంతపురం వైద్యం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ప్రజలవద్దకెళ్లి పనిచేస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందిని వైట్‌కాలర్ ఉద్యోగులతో పోల్చుతూ నిబంధనలు విధించడం సరికాదని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీ హంస) అధ్యక్షుడు అరవ పాల్ పేర్కొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు షఫీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి అరవపాల్, రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్, నాగవర్ధన్, రామకృష్ణ, సంగ వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అరవపాల్ మాట్లాడుతూ.. నెలవారి జీతాల ఎఫ్‌ఆర్‌ఎస్ లింక్‌ను ఫీల్డ్‌స్టాఫ్‌కు మినహాయింపు ఇవ్వాలన్నారు. 12వ పీఆర్సీని నియమించి ఐఆర్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కణేకల్లు, శింగనమల, తాడిపత్రి, పెనుకొండ, గుత్తి, ఉరవకొండ, అనంతపురం నగరం, తాలూకాల కమిటీలను నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామన్న, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, కోశాధికారి కృష్ణమూర్తి, సెక్రటరీ మహేంద్రబాబు, నల్లప్ప, భక్తర్‌వలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరవపాల్

కల్లూరు మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తా

● శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు



కల్లూరు మార్కెట్‌ను పరిశీలిస్తున్న దండు శ్రీనివాసులు

శింగనమల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కల్లూరు మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామని శింగనమల మార్కెట్‌యార్డు చెర్మన్ దండు శ్రీనివాసులు పేర్కొన్నారు. కల్లూరు సబ్ మార్కెట్ యూనిట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడైనా మార్కెట్ భవనాలు శిధిలావస్థకు చేరి ఉంటే మరమ్మతులు చేపడతామన్నారు. రైతులు గిట్టుబాటు ధర వచ్చే వరకు ధాన్యాన్ని, పండ్లను వాటిల్లో నిల్వ చేసుకోవడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ అధికారులు పాల్గొన్నారు.

ఆ సర్కిల్లో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

అనంతపురంరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాప్తాడు- చెన్నయ్ హైవేతో పాటు కందుకూరు-ధర్మవరం రోడ్డు, అనంతపురం రోడ్డు కలిసే సర్కిల్లో యుద్ధప్రాతిపదికన బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు సర్కిల్లో శనివారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామాంజనేయులు మాట్లాడుతూ.. ఈ రోడ్ల వెంబడి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. ఇలాంటి ప్రదేశంలో హైవే అధికారులు డిజైన్ లోపం వల్ల బ్రిడ్జి నిర్మాణం చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తక్షణం ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాప్తాడు రూరల్ కమిటీ సభ్యులు పుష్పరాజ్, సుబ్బారావు, మల్లేష్, అమర, నారాయణ స్వామి, శివ, పెద్ద నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

విజయనగర లా కాలేజీలో క్విజ్ పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని విజయనగర లా కళాశాలలో శనివారం భారత రాజ్యాంగంపై విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఒక్కొక్క బృందంలో ఆరుగురు చొప్పున ఏడు బృందాలుగా కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యాయ శాస్త్ర అధ్యాపకులు సోనీ, వాసవీలత క్విజ్ మాస్టర్లుగా వ్యవహరించారు. ఇందులో ఎం.ఉషా, బి. భరత్, రాఘవేంద్ర, జ్యోతి, పమిలా, ప్రబింధు విద్యార్థుల బృందం గరిష్ఠ మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. యోగిత, హారిక, ఆశాలత, హరికుమారి, రవికుమార్, శ్రీసాయిచరణ్ బృందం రన్నర్లుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్రచార్ అభినందించారు. అధ్యాపకులు పీవీ నిర్మలాదేవి, కల్పన, రమన్య, తేజస్విని పాల్గొన్నారు.

ఉపాధిహామీపై గ్రామసభలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):మండల వ్యాప్తంగా 15 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీపై అధికారులు శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఇందులో కొత్తజాబ్‌కార్డుల కోసం 150 అర్జీలు వచ్చినట్టు ఏపీఓ జయమ్మ తెలిపారు. అర్జీలను పరిశీలించి జాబ్‌కార్డులను మంజూరుచేస్తామన్నారు. ఈకేవైసీ చేయించుకోని వారి జాబ్‌కార్డులను రద్దుచేయడం జరుగుతుందని ఏపీఓ తెలిపారు.

గార్లదిన్నె: మండలంలోని 18 పంచాయతీల్లో ఉపాధి పథకం అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. ఏపీఓ ఓబన్న మాట్లాడుతూ... వివిధ గ్రామాల్లో కొత్తగా పెళ్లిళ్ల అయి జాబ్‌కార్డు లేని వారు సుమారు వంద మంది దాకా దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. వారిరందరికీ త్వరలోనే జాబ్‌కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. ఇంకా ఏవేని సమస్య వల్ల జాబ్‌కార్డులేనివారు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. టెక్నికల్ అసిస్టెంట్ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



కొత్త లేబర్ కోడ్‌ల జీఓ ప్రతులను దహనం చేస్తున్న వామపక్ష నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లపై వామపక్షాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త లేబర్‌కోడ్‌లను నిరసిస్తూ జిల్లాకేంద్రంలో శనివారం ఆందోళన చేపట్టారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. కొత్తలేబర్ కోడ్‌ల జీఓ కాపీలను దహనం చేశారు. ఈసందర్భంగా నాయకులు రాజారెడ్డి, నాగేంద్ర మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లు కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు. కేవలం కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగానే వాటిని తీసుకొచ్చారని మండిపడ్డారు. వెంటనే ఈలేబర్‌కోడ్‌లను రద్దు చేసుకోవాలన్నారు. లేదంటే దేశవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఆర్వీ నాయుడు, రాజేష్‌గౌడు, వెంకటనారాయణ, కృష్ణుడు, నాగభూషణ , రమాదేవి, మనోహర్, విశ్వనాథ్, రాజామోహన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలి: సీపీఐ

అనంతపురం విద్య, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కగారు ఆపరేషన్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ ఇతర వామపక్షశ్రేణులతో కలిసి సీపీఐ నాయకులు శనివారం జిల్లాకేంద్రంలోని టవర్‌క్లాక్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా నారాయణ స్వామి మాట్లాడుతూ దేశంలో నక్సలిజం లేకుండా చేస్తామని మోదీ,అమిత్‌షాలు చెబుతూ ఎన్‌కౌంటర్లు చేయిస్తున్నారన్నారు. నక్సల్స్‌తో ఎలాంటి చర్చలు జరపకుండా బూటకపు ఎన్‌కౌంటర్లు చేయించడం దుర్మార్గమన్నారు. చివరకు లొంగిపోతామంటున్న నక్సల్స్‌ను దొరికినవారిని దొరికినట్లు పోలీసులచేత చంపిస్తున్నారని మండిపడ్డారు. ఇలా చేయడం చట్ట విరుద్ధమన్నారు. వెంటనే బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలన్నారు. అదుపులో ఉన్న నక్సల్స్‌ను కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి, శ్రీరాములు,రామక్రిష్ణ, లింగమయ్య,రమణయ్య, సంతోష్,కుళ్లాయిస్వామి, కృష్ణుడు ,సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లాకార్యదర్శి ఇండ్లప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కూచ్ బెహర్ ట్రోఫీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బీసీసీఐ కూచ్ బెహర్ ట్రోఫీ అండర్-19 ఆంధ్రా-ఒడిశా మ్యాచ్ ఆదివారం ప్రారంభం కానుంది. నాలుగు రోజులపాటు సాగే మ్యాచ్‌కు సంబంధించి స్థానిక అర్డీటీ స్టేడియంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తిచేశారు. శనివారం ఆంధ్రా, ఒడిశా జట్ల క్రికెటర్లు గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేశారు. బీసీసీఐ రెఫరీ వరుణ్‌కుమార్, అంపైర్లు జై సంఘని, సబిసాచి సర్కార్.. పిచ్‌ను పరిశీలించారు. ఆంధ్రా కెప్టెన్ రాజేష్, మేనేజర్ కిరణ్, ఒడిశా కెప్టెన్ విశ్వజిత్ ప్రధాన్, మేనేజర్ ప్రవంజన్ మల్లిక్.. రెఫరీలు, అంపైర్లతో మ్యాచ్ నిర్వహణ, పిచ్, ఏర్పాట్లపై చర్చించారు.

అరటి రైతును ఆదుకుంటాం: జేసీ

రాప్తాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు అన్నివిధాలా ఆదుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. మండలంలోని గొంది రెడ్డిపల్లి వద్ద శీనప్పకు చెందిన అరటి తోటను శనివారం ఆయన పరిశీలించారు. పంట నష్టంపై వివరాలు ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ... గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతు శీనప్ప మూడెకరాల్లోని అరటి పంటను తొలగించాడన్నారు. నష్టం నివేదికలను ప్రభుత్వానికి పంపి, రైతులను ఆదుకుంటామని తెలిపారు. ఎగుమతులు పెంచడానికి అవసరమైన లాజిస్టిక్స్ సహకారాన్ని రైల్వేశాఖ ద్వారా కూడా ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు.



అరటి పంటను పరిశీలిస్తున్న జేసీ శివనారాయణ శర్మ

ఎస్కేయూలో అభివృద్ధి జోరు

● పీఎం ఉష కింద రూ.20 కోట్లు మంజూరు



సెంట్రల్ రీసెర్చ్ బ్లాక్ నిర్మాణానికి భూమిని చదును చేస్తున్న దృశ్యం

అనంతపురంరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవ రాయ యూనివర్సిటీ (ఎస్కేయూ)లో అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. పీఎం ఉష పథకం కింద రూ.20కోట్లు మంజూరయ్యాయి. ఇందులో వివిధ భవనాల నిర్మాణానికి రూ.5.75కోట్లు కేటాయించారు. రూ.5కోట్లతో సెంట్రల్ రీసెర్చ్ బ్లాక్ నిర్మాణం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. వర్సిటీలో కాంపిటీటివ్ బిల్డింగ్‌పై ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణానికి రూ.50 లక్షలు, ల్యాన్, వైఫై సర్వర్‌కు రూ.25లక్షలు, మరమ్మతుల నిమిత్తం భువన విజయం ఆడిటోరియానికి రూ.1.50కోట్లు, పరీక్షల విభాగంలో కంప్యూటర్ సెక్షన్‌కు రూ.50 లక్షలు, మరో రూ.50లక్షలతో శబరి అతిథి గృహం అభివృద్ధి పనులు చేయనున్నారు. పరికరాల కొనుగోలుకు రూ.8.05కోట్లు మంజూరయ్యాయి. సాఫ్ట్ కాంపోనెంట్స్‌కు రూ.3.75 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో దాదాపు 31సాఫ్ట్ కాంపోనెంట్స్ చేపట్టనున్నారు. దీంతో వర్సిటీ రూపురేఖలు మారనున్నాయి.

'సహజ వనరులను సంరక్షించాలి'

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సహజ వనరులను సంరక్షించాలని, అప్పుడే వ్యవసాయానికి అనుగుణంగా వాతావరణం పరిస్థితులు ఏర్పడతాయని పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. స్థానిక ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో శనివారం వాతావారణానుకూల వ్యవసాయ సాంకేతిక సలహా కమిటీ సమావేశం జరిగింది. ఇందులో మాజీ ఐసీఏఆర్ డైరెక్టర్ బండి వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్లు రవీంద్రనాథ్, సుష్మ, ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం వ్యవసాయ మాజీ డీన్ యలమంద రెడ్డి పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని వాతావరణంలో వస్తున్న మార్పులకు, సహజ వనరుల సంరక్షణకు సంబంధించి చేసిన పరిశోధనలు దేశానికే రోల్‌మోడల్‌గా నిలవనున్నాయని తెలిపారు. కొన్నేళ్ల నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి గ్రామాల్లో పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మొక్కలు నాటడం, సహజ వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సత్ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న వాతావరణ అనుకూల మార్పులు, వ్యవసాయంలో విప్లవంపై మెరుగైన ఫలితాలు సాధనకు తమ వంతుగా పనిచేస్తామని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు వాసన్, భక్తర్‌వలీ, పవన్, గోపాల్ రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

29న మండల సర్వసభ్య సమావేశం

అనంతపురంరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దివాకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. నగరంలోని రూరల్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలన్నారు. అధికారులు తమ ప్రగతి నివేదికలు సమావేశానికి మూడు రోజుల ముందు ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఉద్యోగాలకు అనంతలక్ష్మి విద్యార్థులు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

అనంతపురంరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టిన ప్రాంగణ నియామకాల్లో సుమారు 105మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థులను కళాశాలచైర్మన్ అనంతరాముడు, వైస్‌చైర్మన్ రమేష్‌నాయుడు, ప్రాంగణ నియామకాల అధికారి సురేంద్రనాయుడు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ప్రాంగణ నియామకాల అధికారి మాట్లాడుతూ.. చెన్నైకి చెందిన రెనాల్ట్ నిసాన్, టాటా మోటార్స్ కంపెనీ ప్రతినిధులు ప్రాంగణ నియామకాలు చేపట్టారన్నారు. ఇందులో కళాశాలలో బీటెక్ మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 136మంది పాల్గొన్నారన్నారు. వారికి కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు వివిధ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి 105మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. రెనాల్ట్ నిసాన్ కంపెనీకి 68మంది, టాటా మోటార్స్‌కి 37మంది ఎంపికయ్యారన్నారు. వార్షిక వేతనం రూ.3లక్షల వరకు ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారని వారు పేర్కొన్నారు.

'బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి'

అనంతపురం క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బందిని వైసీపీ నాయకులు బెదిరింపులకు గురి చేస్తున్నారని, వారిపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి వన్నూరు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు పరమేశ్, కొండన్న, ఇతర నాయకులు శనివారం 50వ డివిజన్‌లోని 72వ సచివాలయాన్ని సందర్శించారు. అక్కడి ఉద్యోగులపై స్థానిక కార్పొరేటర్ గురుశేఖర్, ఆయన అనుచరులు బెదిరింపులకు పాల్పడుతుండటంపై మండిపడ్డారు. సదరం సర్టిఫికెట్, పించన్లు, బీ ఫాం పట్టాలు ఇప్పించాలని వైసీపీ నేతలు బెదిరించినా చేయరాదని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. వాటిని చేయిస్తామంటూ వైసీపీ నాయకులు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో పథకాల అమలు పారదర్శకంగా ఉంటుందన్నారు. కార్పొరేటర్, అతని అనుచరులపై కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు నరేంద్రచౌదరి, సంజీవ, శీనా పాల్గొన్నారు.

రేపు మెప్మా ఆధ్వర్యంలో రుణాల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు, వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి రుణాల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు అనంత నగరపాలక సంస్థ కమిషన్ బాలస్వామి శనివారం ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ ఆనంద్, మేయర్ వసీం హాజరవుతారన్నారు. మెప్మా అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, వీధి వ్యాపారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ పరిశీలన

అనంతపురం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాముదాయి గ్రామంలో గల ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరికుమార్, రాచానపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు పాముదాయి రఘు శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. పదేళ్ల కింద ట్యాంకు నిర్మాణం చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి నీటి సరఫరా చేయకుండా వదిలేశారన్నారు. ఈక్రమంలోనే ట్యాంకును పరిశీలించామన్నారు. పైపులైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మానవ మనుగడకు చెట్లే కీలకం

● పురావస్తు ప్రదర్శనశాలల డీడీ రామసుబ్బారెడ్డి

అనంతపురం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు చెట్లే కీలకమని పురావస్తు ప్రదర్శన శాలల డీడీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు పురావస్తు ప్రదర్శన శాలలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు 'మానవ మనుగడలో చెట్ల పాత్ర' అనే అంశంపై పోస్టర్ తయారీ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డీడీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మానవ జీవితంలో చెట్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయన్నారు. సమస్త మానవాళి జీవనానికి వృక్షాలే ఆధారమన్నారు. మనుషులంతా ప్రకృతితో మమేకమై జీవనం కొనసాగించాలని సూచించారు. అనంతరం ఏపీ ఎంబీపీ పీడీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ... జిల్లా పురావస్తు శాఖ నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు దోహదపడతాయన్నారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం, వృక్షాల ప్రాముఖ్యత వంటి అంశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో పురావస్తు ప్రదర్శన శాలల శాఖ ఏడీ స్వామినాయక్, ఇంటాక్ కోకన్వీనర్ కృష్ణమూర్తి, సభ్యులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ రియాజుద్దీన్ అహ్మద్, రామాంజనేయులు, టీవీ రెడ్డి, డాక్టర్ రమేష్ నారాయణ, యాడికి సూర్యనారాయణరెడ్డి, ఒంటెద్దు రామలింగారెడ్డి, సీనియర్ రచయిత లంకా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ తయారీ, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బాబా జయంతి వేడుకలో ఎంపీ, ఎమ్మెల్యేలు

అనంతపురంక్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు శనివారం పుట్టపర్తికి వెళ్లారు. అక్కడికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ రాగా.. వారికి పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. తర్వాత పూర్ణచంద్ర ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. వారిలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాప్తాడు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, మడకశిర ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కాలవశ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, ఇతర నాయకులు ఉన్నారు.



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న పరిటాల సునీత



ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, కాలవ శ్రీనివాసులు

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను డీఈఓ ప్రసాద్‌బాబు శనివారం తనిఖీ చేశారు. జిల్లాలోని అన్ని మండలాలలో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అనంతపురంరూరల్‌తో పాటు నగరంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్లస్టర్ సమావేశాలను డీఈఓ పరిశీలించారు. ఈ సమావేశాలకు ఏయే స్కూల్ నుంచి ఎంతమంది టీచర్లు రావాల్సి ఉంది. ఎందరు హాజరయ్యారనే వివరాలను రికార్డుల్లో పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. బోధనలో మార్పులు తీసుకు రావడానికే క్లస్టర్ మీటింగ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీచర్లు వీటిని సద్వినియోగం చేసుకుని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన చేయాలని సూచించారు.

లీగల్ సర్వీసెస్ క్లినిక్ ప్రారంభం



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో లీగల్ సర్వీసెస్ క్లినిక్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దీనిని లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, న్యాయాధికారి రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెన్షనర్లు వ్యక్తిగత, కుటుంబ, ఆరోగ్యపరమైన సమస్యలతో పాటు ఆస్తి తగాదాలు, బెదిరింపులు, దాడులు తదితర వాటిని లీగల్ సర్వీసెస్ క్లినిక్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఎవరైనా సమస్యపై న్యాయాధికారిని సంప్రదిస్తే... లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ప్రత్యేకంగా కేసులను వాదించి సమస్యలకు పరిష్కారం చూపుతారని చెప్పారు. ఫీజులు చెల్లించకుండా ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్నగౌడ్ మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసంమే లీగల్ సర్వీసెస్ క్లినిక్ ప్రారంభించారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లాయర్ శ్రీదేవి, పెన్షనర్లు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల కార్యవర్గం ఎన్నిక



ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కమిటీ అధ్యక్షుడు తదితరులు

అనంతపురం వైద్యం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక రెండోసారి కూడా ఏకగ్రీవమైంది. స్థానిక ఎల్ఐసీ బ్రాంచ్-2 కార్యాలయంలో శనివారం సమావేశాన్ని నిర్వహించి కార్యవర్గ సమావేశాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆదిశేషయ్య, ప్రధాన కార్యదర్శిగా చెరుకుతోట జగదీష్, ట్రెజరర్‌గా బి.ఆదిశేషయ్య ఎన్నికయ్యారు. తర్వాత వారు మాట్లాడుతూ.. సంఘటితంగా పనిచేసి పాలసీదారులతోపాటు సంస్థ అభివృద్ధిలో భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేశారు. సంఘం నాయకులు నారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, భారత్‌రెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు విస్తృతస్థాయి సమావేశం

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బీసీ కులగణనపై ఆదివారం ప్రజా మానవహక్కుల కమిటీ ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగేంద్ర శనివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక లలితకళాపరిషత్‌లో ఉదయం 9 గంటలకు బీసీ జనాభా దామాషా పద్ధతిలో రాజకీయ నామినేటెడ్ పదవులు, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత కల్పించాలనే అంశంపై కులసంఘాల నాయకులతో చర్చించడం జరుగుతుందన్నారు. కుల,ప్రజా సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గుట్టుగా నేషనల్ బాలికల ఫుట్‌బాల్ పోటీలు


● అసోసియేషన్‌లో విభేదాల వల్లేనని విమర్శలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నేషనల్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలను గుట్టుగా నిర్వహిస్తున్నారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఈ నెల 18వ తేదీ నుంచి జాతీయ ఫుట్‌బాల్ బాలికల పోటీలు కొనసాగుతున్నాయి. ఇందులో ఏపీ జట్టు మూడు మ్యాచ్‌ల్లోనూ ఘోరపరాజయం పాలైంది. ఈ విషయాలను బయటకు పొక్కకుండా దాచారు. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో ఉండే విబేధాల కారణంగానే మీడియాకు సైతం సమాచారం లేకుండా ఈ పోటీలు నిర్వహిస్తున్నటు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఉన్న వైసీపీ ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు, కడపకు చెందిన మరో వైసీపీ ప్రతినిధి డేనియల్ ప్రదీప్‌కు, అనంతపురం జిల్లాకు చెందిన ఓ ప్రతినిధి మధ్య ఉన్న విబేధాలతో ఇలా చేస్తున్నారని విమర్శలు గట్టిగానే వినిపిస్తున్నాయి. తూతూమంత్రంగా జాతీయ పోటీలు నిర్వహించి నిధులు పక్కదారి పట్టించేందుకే ఇలా గుట్టుగా ఉంచారనే ఆరోపణలూ లేకపోలేదు. దేశవ్యాప్తంగా సుమారు 16 జట్లు ఇక్కడికి వచ్చి ఆడుతున్నప్పటికీ కనీసం మీడియాకు సమాచారం ఇవ్వకుండా గుట్టుగా నిర్వహించాల్సిన అవసరం ఏముందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

టమోటా కిలో రూ.47

అనంతపురంరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శనివారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.47తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.24తో, సరసరిగా రూ.30తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2100 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల వితరణ



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురంటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చదువుల్లో రాణిస్తూ పేదరికంతో బాధపడుతున్న ఇద్దరు బీటెక్ విద్యార్థులకు అమ్మ సంస్థ వారు ల్యాప్‌టాప్‌లు, మెటీరియల్ వితరణ చేశారు. నగరానికి చెందిన లక్ష్మినారాయణ బేల్దారి పని చేసుకుంటూ కుమారులు నరేష్, అనిల్‌ను చదివిస్తున్నారు. వారు ఇంటర్ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుకుని 70శాతం మెరిట్ సాధించారు. దీంతో కర్నూలులోని పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు లభించాయి. పేదరికంతో ఇబ్బంది పడుతున్న వీరు బీటెక్ విద్యాభ్యాసానికి అవసరమైన ల్యాప్‌టాప్‌లు, స్టడీ మెటీరియల్ కోసం అమ్మ సంస్థను ఆశ్రయించారు. స్పందించిన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి శనివారం స్థానిక సంస్థ కార్యాలయంలో ల్యాప్‌టాప్‌లు, బీటెక్ స్టడీ మెటీరియల్‌ను వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యార్థుల విద్యాభ్యాసానికి భవిష్యత్తులోనూ తనవంతు సహకారమందిస్తానని హామీ ఇచ్చారు.



సాయి కుల్వంతు మందిరంలోని సత్యసాయిబాబా మహా సమాధి వద్ద ప్రణమిల్లిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్

సాయిరాం.. సాయిరాం..!

పుట్టపర్తిలో ఆధ్యాత్మిక పరిమళం.. శత జయంతికి తరలివచ్చిన ప్రముఖులు

సత్యసాయి శత జయంతి వేడుకలకు తరలివచ్చిన ప్రముఖులు, భక్తులతో పుట్టపర్తిలో పండుగ వాతావరణం నెలకొంది. పూర్ణచంద్ర ఆడిటోరియంలో జరిగిన వేడుకలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. సత్యసాయి ప్రేమ సేవలు, ప్రేమ విశ్వవ్యాప్తమని, వాటిని మరింత విస్తరిద్దామని పిలుపునిచ్చారు. సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం, మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. విలువలతో కూడిన విద్య ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. భావి తరాలకు మార్గదర్శకం కావాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. అంతకుమునుపు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులతో కలిసి సత్యసాయి మహా సమాధిని సందర్శించారు.సాయికుల్వంతు మందిరంలో విద్యార్థుల 'సాయికథ గాన సుధ' ప్రదర్శన అలరించింది. వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. దాదాపు 40వేల మందికి నారాయణ సేవ అందించారు. **- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి**





రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



చిన్నారితో కలిసి వస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము





శత జయంతి వేడుకలలో రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఆర్‌జే రత్నాకర్



అలంకరణలో సత్యసాయిబాబా మహాసమాధి



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



జ్ఞాపికను అందుకుంటున్న ఉప రాష్ట్రపతి, వేదికపై సీఎం, మంత్రి, ట్రస్టు ప్రతినిధులు



రాష్ట్రపతి హాజరైన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, భక్తులు



ఆధ్యాత్మిక జ్యోతి



స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థులు



స్కార్పియో.. ఓ సినిమా కథ

- క్రైం స్టోరీ నడిపిన ఓ టీవీ చానల్ రిపోర్టర్
- సొంత వాహనాన్ని ధ్వంసం చేయించిన వైనం
- నిజాన్ని నిగ్గు తేల్చిన పోలీసులు.. పలువురికి రిమాండ్
- కేసు భయంతో గుంటూరు నుంచి అనంతకు మకాం
- వెతుక్కుంటూ వచ్చిన గుంటూరు పోలీసులు
- వాహనం స్వాధీనం...ఆలస్యంగా వెలుగులోకి...

అనంతపురం క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇది ఒక స్కార్పియో కథ. అచ్చం సినిమాని తలపించేలా ఓ టీవీ చానల్ రిపోర్టర్ నడిపిన క్రైం స్టోరీ. కథ మొత్తం స్కార్పియో చుట్టూనే తిరిగింది. గుంటూరులో మూలాలు ఉన్న ఈ స్టోరీ అనం తపురంలో మలుపులు తిరిగింది. చివరకు వాహనాన్ని గుంటూ రు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రైం స్టోరీ ఆలస్యంగా వెలుగుచూసింది. అనంతపురం జిల్లాకు చెందిన పలువురు టీవీ చానళ్ల రిపోర్టర్లు ఇటీవల సత్యసాయి బాబా జయంతి వేడుకలకు ఒక స్కార్పియో వాహనంలో వెళ్లారు. కొత్తగా వచ్చిన ఆ చానల్ రిపోర్టర్ ఆహ్వానం మేరకు మరిన్ని చానళ్ల రిపోర్టర్లు కూడా వెళ్లారు. ఈ నెల 18న వెళ్లిన రిపోర్టర్లు 19న తిరిగి అనంతపురం వచ్చినట్లు సమాచారం. అయితే రెండు రోజుల కిందట పుట్టపర్తికి వెళ్లేందుకు స్కార్పియోను సమకూర్చిన కొత్త చానల్ రిపోర్టర్‌ను గుంటూరు పోలీసులు, అనంతపురం పోలీసులు పిలిపించారు. ఆ స్కార్పియో కథేంటో చెప్పాలని ఆరా తీశారు. కూపీ లాగి ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ చానల్ రిపోర్టర్ కూడా చేసేదేమీలేక వెనుతిరిగి వచ్చారు. అయితే ఆ వాహనంలో పుట్టపర్తి వెళ్లిన చాలా మందికి దాని వెనుక ఉన్న అసలు కథ మాత్రం తెలియదు. అయితే దీని వెనుక థ్రిల్లింగ్ స్టోరీ ఉన్నట్లు పోలీసు విచారణలో బట్టబయలైంది.

క్రైం స్టోరీ గుంటూరు టు అనంతపురం

ఈ స్కార్పియో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం వెనుక అసలు క్రైం స్టోరీ గుంటూరులో జరిగినట్లు సమాచారం. గుంటూరులో ఓ సీఐకు, మరో చానల్ రిపోర్టర్‌కు వివాదం ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆ రిపోర్టర్ కొంతమందికి మాస్కులు వేయించి, తన స్కార్పియో వాహనాన్ని ధ్వంసం చేయించాడు. ఈ మొత్తం సీన్‌ను సెల్‌ఫోన్‌లో రికార్డు చేయించాడు. తర్వాత తన వాహనాన్ని ఓ సీఐ ధ్వంసం చేయించాడంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే పోలీసులకు అనుమానం వచ్చి విచారణ చేయడంతో ఈ మొత్తం ఎపిసోడ్‌కు రచయిత, డైరెక్షన్ అంతా ఆ టీవీ చానల్ రిపోర్టరేనని తేలింది. ఆ రిపోర్టర్ కొంత మంది మాస్కులు వేసుకున్న వారితో ధ్వంసం చేయించడం, ఆయన సెల్‌ఫోన్‌లో రికార్డు చేయించడం, అంతా సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో అసలు కథ బయటపడింది. ఈ కేసులో మాస్కులు వేసుకుని వాహనాన్ని ధ్వంసం చేసిన వారిని పోలీసులు రిమాండ్‌కు పంపారు. అయితే కీలక వ్యక్తి మాత్రం గుంటూరులో తప్పించుకుని అనంతకు వచ్చాడు.

అదే వాహనంతో అనంతకు...

గుంటూరులో పోలీసులకు దొరక్కుండా తప్పించుకున్న ఆ చానల్ రిపోర్టర్ తన మకాం అనంతకు మార్చాడు. తన స్కార్పియో వాహనంలోనే గుంటూరు నుంచి హైదరాబాద్ మీదుగా అనంతపురం వచ్చినట్లు సమాచారం. అయితే అప్పటికే నిఘా ఉంచిన గుంటూరు పోలీసులు అన్ని టోల్‌గేట్ల సీసీ కెమెరాలు పరిశీలించారు. గుంటూరు నుంచి అనంతపురం వరకూ సీసీ కెమెరాల్లో కనిపించిన ఆ వాహనం అనంతపురం దాటి వెళ్లకపోవడంతో నిందితుడు ఇక్కడే ఉన్నాడంటూ అనుమానించారు. అతడిని వెతుక్కుంటూ ఇటీవల జిల్లాకు వచ్చారు. గుంటూరు నుంచి వచ్చిన ఆ చానల్ రిపోర్టర్, అనంతపురంలోని అదే చానల్‌లో పని చేసే స్థానిక రిపోర్టర్‌కు వాహనం అప్పజెప్పాడు. ఎలాగూ చేతిలో వెహికల్ ఉందంటూ ఆ కొత్త చానల్ స్థానిక రిపోర్టర్‌తోపాటు, మరికొన్ని చానళ్ల రిపోర్టర్లు 18, 19 తేదీల్లో పుట్టపర్తికి కవరేజ్ కోసం వెళ్లి వచ్చారు. అయితే అప్పటికే జిల్లాకేంద్రానికి చేరుకున్న గుంటూరు పో లీసులు, అనంతపురం పోలీసులతో కలిసి విచారణ చేశారు. గుం టూరులో ఓ టీవీ చానల్ రిపోర్టర్ నడిపిన క్రైం స్టోరీ వెహికల్ అనంతపురంలోని అదే చానల్ రిపోర్టర్ వద్ద ఉన్నట్లు గుర్తించి, విచారణ చేసిన పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత వాహనాన్ని గుంటూరుకు తరలించారు. అయితే ఈ విషయాలేవీ తెలియక అందులోనే పుట్టపర్తికి వెళ్లిన రిపోర్టర్లు విషయం తెలుసుకుని 'అయ్యబాబోయ్...ఈ స్కార్పియో వెనుక ఇంత కథ నడిచిందా' అంటూ ముక్కున వేలేసుకున్నారు.

సీఐ సతీష్ హత్య కేసును నిష్పాక్షికంగా విచారించాలి

- కుమ్మర శాలి వాహన సంఘం



సమావేశమైన కుమ్మర శాలి వాహన సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ విజిలెన్స్ ఆఫీసర్, సీఐ సతీష్‌కుమార్ హత్య కేసును నిష్పక్షపాతంగా విచారించి, నేరస్థులను కఠినంగా శిక్షించాలని ఏపీ కుమ్మర శాలి వాహన రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి, జిల్లా అధ్యక్షుడు పోతులయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఏపీ కుమ్మర శాలి వాహన సంఘం జిల్లా కార్యాలయం లో ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన సంఘం నాయకులు శనివారం సమావేశమయ్యారు. సీఐ సతీష్‌కుమార్ హత్యను తీవ్రంగా ఖండించారు. పోతులయ్య మాట్లాడుతూ సీఐ సతీష్‌కుమార్ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించడంతోపాటు రూ.ఆరు కోట్లు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతుడి భార్యకు ఉద్యోగం ఇచ్చి, పిల్లల చదువులకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కేవీ రమణ, ఆంజినేయులు, గోపాల్, కృష్ణ, మలరాయుడు, రామాంజినేయులు, ఓబులేసు, వెంకటేష్, సంగమేశ్ పాల్గొన్నారు.

చిట్టి చేతలు..!

సృజనకు ప్రాణం... స్వయం ఉపాధికి సోపానం

- అబ్బురపరిచిన చిన్నారుల ఆవిష్కరణలు
- అట్టహాసంగా జిల్లాస్థాయి నైపుణ్యాభివృద్ధి పోటీలు



చీర కట్టులో వైవిధ్యంగా ముస్తాబు అయిన రాయదుర్గం కేజీబీవీ విద్యార్థినులు

బుక్కరాయసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిట్టి చేతులు ఎన్నో చిత్రాలను చేశా యి. అబ్బురపరిచే కళాఖండాలను సృష్టించా యి. జిల్లాస్థాయి నైపుణ్యాభివృద్ధి పోటీల్లో బాలబాలికలు తమలోని సృజనకు పదును పెట్టారు. సమగ్రశిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీలో శనివారం నిర్వహించిన పోటీల్లో బాలబాలికల ఆవిష్కరణలు అబ్బురపరిచాయి. సైబర్ సెక్యూరిటీ మొదలుకుని.. ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, ఆరోగ్య సంరక్షణ, బ్యాంకింగ్ వ్యవస్థ, వస్త్రాలు, ఆహార పదార్థాల తయారీ, ఆటోమోటివ్, వ్యాపారం తదితర రంగాల్లో ప్రదర్శించిన నమూనాలు ఆలోచింపజేశాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి దా దాపు 800 మంది విద్యార్థులు 252 ప్రాజెక్టు న మూనాలను ప్రదర్శించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, హ్యాకింగ్, క్యూఆర్ కోడ్, కంప్యూటర్‌లో వచ్చిన విప్లవాత్మక మార్పులపై ప్రాజెక్టులను రూపొందించారు. సైబర్ మోసాల పట్ల ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. బాలికలు బ్యూటీషియన్ కోర్సుల్లో మెలకువలు, చీరకట్టులో వైవిధ్యం, ఫ్యాషన్ ట్రెండ్స్‌పై ప్రాజెక్టులను రూపొందించారు. చదువు పూర్తయ్యాక సొంత కాళ్లపై నిలబడేందుకు ఈ నైపుణ్యాలు ఎంతో దోహదపడతాయని టీచర్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రాజెక్టులకు అవార్డులను అందజేశారు. ప్రదర్శనను సమగ్రశిక్ష ఏపీసీ శై లజ, డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో కే జీబీవీ ప్రత్యేకాధికారి నాగవేణి, ఎంఈఓ లింగానాయక్ పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సుతో స్వయం ఉపాధి

బ్యూటీషియన్ కోర్సుల్లో భాగంగా మెహందీ డిజైన్లు, చీర కట్టులో వైవిధ్యం, బ్యూటీ టిప్స్ తదితర అశాలను నేర్చుకున్నా. బ్యూటీపార్లర్ షాపు పెట్టుకునేందుకు ఇది దోహదపడుతుంది.

- శృతి, రాయదుర్గం కేజీబీవీ

సాంకేతికతపై పట్టు సాధించేందుకు కృషి

సైబర్ సెక్యూరిటీపై ప్రాజెక్టు రూపొందించాం. సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలనే దానిపై అవగాహన కల్పించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడానికి ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయి.

- మేఘన, సిరి, వజ్రకరూరు ఆదర్శ పాఠశాల

కొత్త ఆలోచనలకు వేదిక..

ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో అవకాశాలను ప్రాజెక్టుల ద్వారా తెలుసుకోగలిగాం. బయట మార్కెట్‌లో ఏ వస్తువుకు డిమాండ్ ఉంది, దానిని ఎలా తయారు చేయాలి తదితర విషయాలపై స్పష్టత వచ్చింది. ప్రస్తుతం శాండ్ విచ్, కేక్‌లు, జామ్‌లు, ఎగ్ పఫ్, వెజ్ పఫ్ వంటి వాటికి డిమాండ్ ఉంది. ప్రస్తుతం పొందిన శిక్షణ ద్వారా బేకరీ నిర్వహించవచ్చు.

- తేజశ్విని, వీరీష, మోక్షిత రెడ్డి, హనీషా, పామిడి ఆదర్శ పాఠశాల

నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి..

పోటీ ప్రపంచంలో మనుగడ సాగించాలంటే విద్యార్థులు పుస్తక జ్ఞానంతోపాటు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. కేజీబీవీ, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నాం. స్వయం కృషితో జీవించడానికి, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి నైపుణ్యమే అసలైన పెట్టుబడి.

- శైలజ, ఏపీసీ, సమగ్రశిక్ష



బ్యూటీషన్ కోర్సు గురించి వివరిస్తున్న విద్యార్థిని శృతి



సైబర్ సెక్యూరిటీపై ప్రాజెక్టు నమూనా రుపొందించిన వజ్రకరూరు విద్యార్థులు



పామిడి మోడల్ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన బేకరీ ఐటమ్స్



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ

మద్యం దుకాణంలో షార్ట్ సర్క్యూట్

- కూలీ మృతి.. కాలిపోయిన మద్యం బాటిళ్లు



నితిన్ కుమార్ (ఫైల్)

పరిగి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిందునగర్‌లోని ఏవీ వైన్స్‌లో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రమాదంలో అందులో ఉన్న కూలీ నితిన్‌కుమార్ (40) మరణించాడు. షాపులోని మద్యం బాటిళ్లు కాలిపోయాయి. ఏఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పావగడ తాలూకా పాలెళ్లి గ్రామానికి చెందిన నితిన్‌కుమార్ వైన్స్ షాపులో కూలీగా పనిచేస్తుండేవారు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని షాపులోనే నిద్రించాడు. షార్ట్‌సర్క్యూట్‌తో షాపులో మంటలు చెలరేగాయి. ఊపిరాడక అతడు అక్కడికక్కడే మరణించాడు. మద్యం బాటిళ్లు కాలిపోయాయి. ఎంత మేర నష్టం వాటిల్లిందీ తెలియరాలేదు. షాపును ఏఎస్ఐ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నితిన్‌కుమార్ మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

నేమకల్లులో ప్రత్యేక పూజలు


పుష్పాలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ చార్యులు పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ధర్మకర్తలు కాశీనాథ్‌శెట్టి, వన్నూరుస్వామి, శాంతయ్య, దేవదాయశాఖ అధికా రి ఓబన్న, ఆలయ కమిటీ సభ్యుడు హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

ఆటో బోల్తా .. ఆరుగురికి గాయాలు

ఉరవకొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నింబగల్లు సమీపంలో శనివారం ఆటో బోల్తా పడడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. నింబగల్లుకు చెందిన కూలీలు రోడ్డు పనుల కోసం రాంపురం వైపునకు వెళ్తుండగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న వెంకటేశు, ఎల్లప్ప, సురేష్, జి. ఎల్లప్పలతోపాటు మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించాలని వైద్యులు సూచించారు. రోడ్డు ప్రమాదంలో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ముష్టూరు వద్ద మరో ఆటో..

ఉరవకొండ మండల పరిధిలోని చిన్నముష్టూరు హంద్రీనీవా కాలువ సమీపంలో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఉరవకొండ నుంచి ఉదిరిపికొండకు ఇంటి నిర్మాణానికి సంబంధించిన సామగ్రి వేసుకుని వెళ్తుండగా, ద్విచక్రవాహనం అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటో బోల్తా పడిన సమయంలో ఇంజన్ ఆఫ్ కాకపోవడంతో పెద్ద ఎత్తున పొగలు వచ్చాయి. దీంతో అటు వైపు వెళ్తున్న వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

లారీని ఢీకొని డ్రైవర్‌కు..

గుత్తిరూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులోని జాతీయ రహదారిపై శనివా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెం దిన హరిఫ్ అనే లారీ డ్రైవర్ హైదారాబాద్ నుంచి బెంగళూరు వైపు వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొట్టడంతో హరిఫ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

స్కూటీ బోల్తా పడి ఇద్దరికి..

కళ్యాణదుర్గంరూరల్: మండల పరిధిలోని మల్లాపురం గ్రామం వద్ద స్కూటీ బోల్తా పడి ఇద్దరు గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాల్వాయికి చెందిన ప్రశాంత్, జయమ్మ ఇద్దరు స్కూటీలో కళ్యాణదుర్గం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మల్లాపురం గ్రామం వద్ద స్పీడ్ బ్రేకర్ వద్ద కిందపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం తరలించారు. పరిస్థితి విషమంగా వుండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తిరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చానిపల్లికి చెందిన సరస్వతి అనే మహిళ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేదని పోలీసులు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉన్న ఆమెను బంధువులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వాసుపత్రికి కుర్చీల వితరణ

పామిడి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)కి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చిలకల రాజగోపాల్ మిత్రబృందం శనివారం కుర్చీలను వితరణ చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రాయల్ నారాయణ, గౌరవ మల్లికార్జున సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివ కార్తీక్ రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చిలకల రా జగోపాల్‌కు రూ. 5వేలు విలువ గల 10కుర్చీలను అందజేశారు.

బాల్యవివాహాలపై అవగాహన

బొమ్మనహాళ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. కణేకల్లు సీడీపీఓ నాగమణి మాట్లాడుతూ.. బాలికలు చదువుకుంటే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమలమ్మ పాల్గొన్నారు.

రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2,790 క్యూసెక్కులు

బెళుగుప్ప, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2,790 క్యూసెక్కులు ఉన్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు వెల్లడించారు. ఔట్‌ఫ్లో 2,790 క్యూసెక్కులు వుండగా ప్రస్తుతం 1.737 టీఎంసీల నీటి నిల్వ వుందన్నారు. ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1630 క్యూసెక్కులు వెళుతోందని అధికారులు వెల్లడించారు.

శబరిమలలో సౌకర్యాలు కల్పించాలి

గుంతకల్లుటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం శబరిమలలో అయ్యప్ప స్వామి మాలాధారులకు సౌకర్యాలు కల్పించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్ పేర్కొన్నారు. శనివారం డీఆర్‌ఎం కార్యాలయం నుంచి రైల్వే ఇనిస్టిట్యూట్ సర్కిల్ వరకు బీజేపీ, అయ్యప్ప మాలాధారులతో ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోహన్, శ్రీరాములు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక

బెళుగుప్ప, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రిపల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు భరత్, మైలార్ అనే విద్యార్థులు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం లక్ష్మీశిరీషా, పీడీ రాఘవేంద్ర శనివారం తెలిపారు. ఈ నెల 21న జిల్లా స్థాయిలో అనంతపురం ఆర్డీటీలో నిర్వహించగా ప్రతిభ కనబరచి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 28, 29 తేదీలలో పుట్టపర్తి జిల్లా చిగిచెర్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.



జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

బీటీపీ కాలువ పనులకు మహర్దశ

- మంత్రి లోకేశ్ హామీతో వేగవంతం
- నెరవేరనున్న కళ్యాణదుర్గం రైతుల కల

కళ్యాణదుర్గం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భైరవానితిప్ప ప్రాజెక్టు కాలువ పనులకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ భైరవానితిప్ప ప్రాజెక్టు కాలువ పనులు పూర్తి చేస్తామని ఈ నెల 8 న కళ్యాణదుర్గంలో నిర్వహించిన భక్త కనకదాసు జయంతి వేడుకల్లో ప్రకటించడంతో.. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ప్రజలు, రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అప్పట్లో టీడీపీ హయంలోనే శంకుస్థాపన చేశామని, ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వంలో పూర్తి చేస్తామని ఆయన అభయం ఇచ్చారు. ఇప్పటికే ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లి సమీపంలో బీటీపీ కాలువ పనులు పునఃప్రారంభించారు. లోకేశ్ హామీతో మరింత వేగం పుంజుకున్నాయి.

రెండు నియోజకవర్గాలు సస్యశ్యామలం

వైసీపీ ప్రభుత్వం బీటీపీ కాలువ పనులను గాలికొదిలేసింది. ఈ పనులు పూర్తయితే కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజక వర్గాల్లో పొలాలు సస్యశ్యామలమవుతాయి. కూటమి ప్రభుత్వం రాగానే పెండింగ్ పనులపై దృష్టి సారించింది. తాజాగా జీడిపల్లి-భైరవానితిప్ప ఎత్తిపోతల పథకం పనులపై మంత్రి లోకేశ్ హామీ ఇవ్వడంతో పనులన్నీ ఊపందుకోబోతున్నాయి. ఎగువన కర్ణాటక రాష్ట్రం వేదవతిపై నాలుగు చెక్‌డ్యాంలు నిర్మించడంతో ఈ ప్రాజెక్టుకు వరద తగ్గిపోతూ వచ్చింది. ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారడంతో జీడిపల్లి నుంచి కృష్ణా జలాలను తరలించాలని గతంలోనే టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2018, అక్టోబరులో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా గరుడాపురం వద్ద పనులకు శంకుస్థాపన చేసి రూ.968 కోట్లు కేటాయించారు. భూ సేకరణకు రూ.120 కోట్లు కేటాయించారు. పనులు వేగంగా చేపట్టారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తర్వాత పట్టించుకోలేదు.

50 వేల ఎకరాలకు సాగునీరు

జీడిపల్లి-భైరవానితిప్ప ఎత్తిపోతల పథకంలో 14 లిఫ్టుల ద్వారా 114 చెరువులకు నీరు అందించాలనేది లక్ష్యం. వీటిలో 79 పెద్ద చెరువులు, 36 చిన్న చెరువులు ఉన్నాయి. చెరువులు నింపడంతో పాటు ఆయా ప్రాంతాల్లోని 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశాలు ఉన్నాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఇప్పటికే మూడు చోట్ల కాలువ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆ పనుల వివరాలన్నీ ఇంజనీర్లతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. పనులు వేగం పుంజుకోవడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.


వేగవంతంగా జరుగుతున్న బీటీపీ కాలువ పనులు

రైతుల కల నెరవేరుస్తాం



మంత్రి నారా లోకేశ్ బీటీపీ కాలువ పనులన్నీ పూర్తి చేస్తామని భక్త కనకదాసు జయంతి వేడుకల్లో ప్రకటించడంతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులకు కృష్ణాజలాలతో నింపి, కర్షకుల కలను నెరవేరుస్తాం. బీటీపీ కాలువ పనులను పూర్తి చేసి జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు తీసుకువస్తాం. ఆ దిశగా ఇప్పటికే పనులన్నీ జోరుగా సాగుతున్నాయి. సాగు, తాగు నీరు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే నియోజకవర్గంలో మూడు చోట్ల కాలువ పనులు జోరుగా సాగుతున్నాయి. ఎప్పటికప్పు డు ఇంజనీర్లతో పనులపై పర్యవేక్షిస్తున్నాను. త్వరలోనే కాలువ పనులు పూర్తి చేస్తాం.

- అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెల్యే, కళ్యాణదుర్గం

13న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న న్యాయాధికారి మంజుల

గుంతకల్లుటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 13న జరిగే జాతీయ లోక్ ఆదాలత్‌లఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు, న్యాయవాదులకు జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయాధికారి ఎం. మంజుల ఆదేశించారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్‌ఆదాలత్‌పై ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు, న్యాయవాదులతో న్యాయాధికారి మంజుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, రాజీ అయ్యే కేసులను జాతీయ లోక్‌ఆదాలత్‌లో పరిష్కరించుకోవాలని తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి రమేష్, న్యాయవాదులు వెంకటేశ్వర్లు, గోపాల్‌కృష్ణ, భాస్కర్ గౌడ్, హేమాద్రి, పాల్గొన్నారు.

'ఎస్‌ఐ గౌస్‌ను సస్పెండ్ చేయాలి'

తాడిపత్రి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండలంలో పనిచేస్తున్న ఎస్‌ఐ గౌస్‌ను సస్పెండ్ చేయాలని మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో వారు మాట్లాడుతూ.. 2021 సంవత్సరంలో పెద్దపప్పూరు మండలం సోమనపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త నారాయణను పొలం గట్టు విషయంలో అప్పటి పెద్దపప్పూరు ఎస్‌ఐగా పనిచేస్తున్న గౌస్ బలవంతంగా డీఎస్పీ కార్యాలయానికి తీసుకుపోయాడని తెలిపారు. అప్పటి డీఎస్పీ వీఎన్‌కే చైతన్య, ఎస్‌ఐ గౌస్ ఇరువురు కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయాడని, వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులే తరలించారని పేర్కొన్నారు. కొద్దిసేపటి తర్వాత నారాయణ మృతి చెందాడని తెలిపారు. నారాయణ కుటుంబానికి రూ.5లక్షలు నగదు, ఐదు ఎకరాల భూమి, ఆయన కొడుకుకు హోంగార్డు ఇప్పిస్తామని చెప్పి మృతదేహాన్ని పూడ్చివేశారని వివరించారు. అనంతరం ఎస్‌ఐ, డీఎస్పీ వారి కుటుంబానికి ఎలాంటి సాయం చేయలేదన్నారు. ఎమ్మెల్యే అశ్మిత్ రెడ్డి ముఖ్యమంత్రికి, హోంమంత్రికి, డీజీపీకి ఫిర్యాదు చేశారని వివరించారు. ఈ మేరకు అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావును విచారణ అధికారిగా నియమించారని తెలిపారు. డీఎస్పీ రెండురోజులక్రితం పెద్దపప్పూరు మండలంలోని పలువురిని విచారించారని అన్నారు. కొందరు సాక్షులను ఎస్‌ఐ గౌస్ బెదిరిస్తున్నాడని అన్నారు. రాబోయే కాలంలో తాను అక్కడికి సీఐగా వచ్చి మీ మీద కేసులు పెట్టి, అంతు చూస్తానని బెదిరింపులకు దిగుతున్నాడని, నారాయణ కుటుంబ సభ్యులు తెలిపారని అన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అరుణ, షెక్షావలి, కౌన్సిలర్లు విజయ్‌కుమార్, మల్లికార్జున, రేష్మాపర్వీన్, జ్యోతి, విజ్జి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తను అభినందించిన అధికారులు

కుందుర్పి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అపిలేపల్లి అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతిని అధికారరులు అభినందించారు. శనివారం ఈసీసీఈ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్ సుశీలమ్మ, పద్మజ హాజరయ్యారు. అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి పిల్లలకు కాన్వెంట్‌కు దీటుగా విద్యాబోధనలు చేయడంతో రాష్ట్ర ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా ఎంపికయ్యారని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఆమెను సత్కరించి, ఉత్తమ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వెంకటచలపతి, అతావుల్లా, రామాంజనేయులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్ర

గుంతకల్లుటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శివ మాలాధారులు శ్రీశైలం భ్రమరాంబ మలికార్జున స్వామి ఆలయానికి శనివారం పాదయాత్రగా బయలు దేరారు. ముందుగా రెడ్డి వీధిలోని రాతిగూడి రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం శివ మాలాధారులు ఇరుముడులు కట్టుకున్నారు. స్వామికి పూజలు చేసి పాదయాత్రగా బయలు దేరారు. ఈ సందర్భంగా గురుస్వాములు కృష్ణారెడ్డి, వాల్మీకి రాముడు, మాట్లాడుతూ.. 35 సంవత్సరాల నుంచి శివమాల ధరించి శ్రీశైలానికి పాదయాత్రగా వెళుతున్నామని తెలిపారు.

గుత్తి సబ్‌జైలు తనిఖీ


నిత్యావసరాలను పరిశీలిస్తున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి రాజశేఖర్

గుత్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును శనివారం సాయంత్రం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎన్. రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ జైలులోని బ్యారెక్‌లు, వంట గది, టాయిలెట్లు, స్టోర్ రూంను ఆయన పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఖైదీలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరిటెండెంట్ మహేశ్వరుడు, న్యాయవాది సూర్యనారాయణ, టైపిస్ట్ సాధిక్‌వలి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గుంతకల్లుటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టదాయకమైక లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు పేర్కొన్నారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో శనివారంం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అంబానీ, ఆదాని, కార్పొరేట్ కంపెనీలు, పెట్టుబడిదారులకు ఈ చట్టాలు అనుకూలంగా ఉన్నాయని మండిపడ్డారు. కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని పలుమార్లు సమ్మెలు, నిరసనలు తెలియజేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, ఈశ్వరయ్య, రామదాసు, సురేష్, కుళ్లాయప్ప, గురుస్వామి, మల్లయ్య, చిదంబరం, జిలాన్, రాజు, సూరి, ఈరన్న, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

గుత్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో ఉన్న ఎస్వీఎస్ మద్యం దుకాణంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడి దాదాపు లక్ష విలువ చేసే సరుకును అపహరించినట్లు నిర్వాహకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్యం దుకాణం వెనుక భాగంలో గుర్తుతెలియని దుండగులు గోడకు రంధ్రం వేసి లోపలకి చొరబడ్డారని తెలిపారు. దాదాపు లక్ష విలువ చేసే 7 మద్యం బాక్స్‌లను ఎత్తికెళ్లినట్లు వివరించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంతకల్లుటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగుట్టపల్లి చిన్నతండాకు చెందిన ఎన్ శీనానాయక్ (39) అనే వ్యక్తి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శనివారం రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు.. శీనా నాయక్ శుక్రవారం ద్విచక్రవాహనంలో తన పొలానికి వెళ్తుండగా గ్రామ సమీపంలో కింద పడ్డాడు. గాయపడిన అతడిని బంధువులు చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీబాయి, కొడుకు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమాలను అరికట్టడానికే ఈకేవైసీ: పీడీ

ఉపాధి పథకంపై పలుచోట్ల గ్రామసభలు

ఉరవకొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమాలను అరికట్టడానికే ఈకేవైసీ చేయిస్తున్నామని డ్వామా పీడీ సలీంబాషా పేర్కొన్నారు. మండలంలోని చిన్నముష్టూరు గ్రామంలో శనివారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామసభలో అభ్యంతరాలు ఉన్న జాబితాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 1.12 లక్షల మంది దాకా జాబ్‌కార్డులకు ఈకేవైసీ చేయించాల్సి ఉందని, ఇప్పటి దాకా 78.34 శాతం చేయించామని తెలిపారు. మండలంలో జాబ్‌కార్డుల కోసం 85 దరఖాస్తులు చేసుకున్నట్లు ఏపీవో సుజాత తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవిప్రసాద్, ఏవో శంకర్ పాల్గొన్నారు.

● విడపనకల్లు: ఉపాధి హామీ పనుల్లో కూలీలకు ఆధార్ లింక్ చేయటం వల్ల అవినీతికి చెక్ పెట్టేందుకు సులువుగా ఉంటుందని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. మండలంలోని వేల్పుమడుగులో గ్రామ సభకు పీడీ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధాకృష్ణ, ఏపీఓ లలిత పాల్గొన్నారు.

●పామిడి: మండలంలో ఉపాధి హామీ పథకంపై గ్రామ సభలు నిర్వహించారు. చేర్పులు, మార్పులు, కొత్త జాబ్‌కార్డు కోసం మండలంలో 309 దరఖాస్తులు వచ్చినట్లు ఏపీఓ ఆదినారాయణమ్మ పేర్కొన్నారు.

● యాడికి: మండలంలోని నిర్వహించిన గ్రామసభల్లో కొత్త జాబ్‌కార్డుల కోసం 305 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో ఏపీఓ చిన్నమద్దిలేటి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో గ్రామసభలు కూలీలు లేక వెలవెలబోయాయి.

● బ్రహ్మసముద్రం: మండల పరిధిలోని పంచాయతీలలో ఉపాధి హామీ పథకంలో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు తీసుకున్నారు. 301 దరఖాస్తులు రాగా పేర్లు చేర్చేందుకు 18 వచ్చినట్లు ఏపీవో రవి తెలిపారు.

● కుందుర్పి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పథకంపై గ్రామ సభలు నిర్వహించారు. కొత్త జాబ్ కార్డుల కోసం 380 ద రఖాస్తులు వచ్చాయి. 120 కార్డులు తొలగించామని ఏపీవో మురళీధర్ తెలిపారు.


విడపనకల్లులో మాట్లాడుతున్న పీడీ సలీంబాషా

● కూడేరు : మండలంలో నూతన జాబ్ కార్డుల కోసం 301 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఏపీఓ పోలేరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా పంచాయితీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వృద్ధులు, మరణించిన వారి 55 జాబ్ కార్డుల తొలగింపుపై అభ్యంతరాలు తెలుసుకున్నారు.

● రాయదుర్గంరూరల్: నూతన జాబ్‌కార్డుల కోసం 240 దరఖాస్తులు వచ్చినట్లు ఏపీఓ రవి పేర్కొన్నారు. 135 మంది పేర్లను తొలగించినట్లు తెలిపారు.

● బెళుగుప్ప: మండలంలో ఉపాధి పథకంపై గ్రామసభలు నిర్వహించారు. కొత్త జాబ్ కార్డుల కోసం 220 దరఖాస్తులు వచ్చాయని, 115 కార్డులు తొలగించామని ఏపీవో మురళి తెలిపారు.

● తాడిపత్రి : మండలంలో ఉపాధి హామీపై గ్రామసభలు నిర్వహించారు. జాబ్‌కార్డుల కోసం 200 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. 800 మంది జాబ్‌కార్డులను తొలగించామని పేర్కొన్నారు.

● యల్లనూరు: మండలంలో నూతన జాబ్‌కార్డుల కోసం 210 దరఖాస్తులు రాగా.. 530 జాబ్‌కార్డులను తొలగించినట్లు ఏపీఓ ఓబిరెడ్డి తెలిపారు.

విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే


విద్యార్థిని వీడియోకాల్‌లో అభినందిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

యాడికి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న అమరావతిలో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీకి తాడిపత్రి నియోజకవర్గం నుంచి ఎంపికైన యా డికి హైస్కూల్ విద్యార్థి అనిల్‌కుమార్‌ను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి శనివారం అభినందించారు. వీడియోకాల్ చేసిన ఎమ్మెల్యే.. ఎంఈఓ కాశప్ప, ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు సమక్షంలో విద్యార్థి అనిల్‌కుమార్‌తో మాట్లాడారు. అనిల్‌కుమార్‌కు ఆల్‌దిబెస్ట్ తెలిపారు. చాలా చిన్న వయస్సులోనే అసెంబ్లీ చూడడం అదృష్టమని పేర్కొన్నారు. తాను మొదట అసెంబ్లీలో అడుగుపెట్టిన క్షణం కన్నీళ్లు వచ్చాయని ఎమ్మె ల్యే తన అనుభవాన్ని పంచుకున్నారు. బాగా చదివి ఉన్నతస్థాయిలో రాణించాలని విద్యార్థికి తెలిపారు. తాను తాడిపత్రికి వచ్చాక కలుస్తానని అన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే అమిలినేని


సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి వేడుకల్లో కళ్యాణదుర్గం నియోజకవర్గ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. పుట్టపర్తి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే స్వాగతం పలికారు. అనంతరం సత్యసాయి జయంతి వేడుకల్లో మంత్రులు, ఎంపీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించండి : ఏఎస్పీ


మాట్లాడుతున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి

పెద్దవడుగూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్‌చౌదరి పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలో మట్కా, పేకాట అక్రమ మద్యం అమ్మకాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నియంత్రించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీతో బిందుసేద్య పరికరాలు

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీఎస్టీలకు ఐదెకరాల వరకు వందశాతం సబ్సిడీతో బిందుసేద్య పరికరాలు ఇస్తామని ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి, జె.రాంపురంలో ఆయన పర్యటించారు. గత ఏడాది ఇచ్చిన డ్రిప్ పరికరాలను తనిఖీ చేశారు. చివరి తనిఖీ అనంతరం ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. కార్యక్రమంలో స్కిప్పర్ మెట్జర్ కంపెనీ డీసీవో రాజకుళ్లాయప్ప, ఎఫ్‌సీవో రామాంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

వీఆర్వోపై దాడికేసులో నిందితుడి అరెస్ట్

తాడిపత్రి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగసముద్రం గ్రామ వీఆర్వో రామాంజనేయులుపై ఈనెల 14న దాడిచేసి గాయపరిచిన కేసులో కర్నూలుకు చెందిన ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు భోగసముద్రంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజుమాదిరిగా ఈనెల 14న ద్విచక్రవాహనంలో భోగసముద్రంకు వెళుతున్న సమయంలో ఐదుగురు వ్యక్తులు కారులో వచ్చారు. కారును ఢీకొట్టాడని ఉద్దేశంతో వీఆర్వోపై దాడిచేసి గాయపరిచారు. మిగిలిన నలుగురిని త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు.

ఇళ్లు, స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

యాడికి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారు ఇళ్లు, ఇంటిస్థలాల కోసం ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చునని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, హౌసింగ్ ఏఈ లోకేష్‌కుమార్ తెలిపారు. శనివారం యాడికిలోని తహసీల్దార్ కార్యాలయంలో హౌసింగ్, సచివాలయ, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత స్థలం ఉండి ఇళ్లు లేనివారి ఇంటి నిర్మాణం కోసం, స్థలం లేని వారు ఇంటి స్థలం కోసం ఈనెల 30లోపు సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నిబంధనల మేరకు అర్హులైన వారికి ఇళ్లు, స్థలాలు మంజూరు చేస్తారని తెలిపారు. సమావేశంలో డిప్యూటి ఎంపీడీఓ శశికళ, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ, నాయకులు రుద్రమనాయుడు పాల్గొన్నారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

డి.హీరేహాళ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గ్రామస్థులంతా కలిసి సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. మండలంలోని పులకుర్తి గ్రామంలో గత కొన్ని రోజులుగా దేవాలయం విషయమై సమస్య కొనసాగుతున్నది. దీనికి సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఎస్‌ఐ గ్రామస్థులు, గ్రామపెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. కులాలకు అతీతంగా పెద్దలందరూ చర్చించుకుని ఎలా పరిష్కరించాలో ఆలోచించాలన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన పీఈటీ

బ్రహ్మసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అథ్లెట్స్ నందు పిల్లలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పీఈటీ టి.జగన్మోహన్‌రెడ్డి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో డిస్కస్‌త్రో, లాంగ్ జంప్ పోటీలలో ప్రథమస్థానం పొంది డిసెంబరులో బీహార్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పీఈటీ జగన్మోహన్ రెడ్డిని ప్రధానోపాధ్యాయులు బసవరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్టీసీ హెడ్ క్లర్క్‌పై చర్యలు తీసుకోవాలి

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తమపై దురుసుగా ప్రవర్తించిన ఆర్టీసీ హెడ్ క్లర్క్ శివప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బస్సుపాస్ కోసం కొంతమంది దివ్యాంగులు తమ ధ్రువీకరణ పత్రాలు అన్ని హెడ్ క్లర్క్ శివప్రసాద్‌కు అందజేశారన్నారు. ఆ ధ్రువపత్రాలు పరిశీలించిన శివప్రసాద్ తమకు బస్సు పాసులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ దివ్యాంగుల పట్ల చిన్న చూపు చూస్తున్నారని మండిపడ్డారు. పట్టణ సీఐ హరినాథ్ న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. పోలీస్ స్టేషన్లో శివప్రసాద్‌పై ఫిర్యాదు చేసినట్లు సంఘం నాయకులు ఉద్దీప్ సింహ తెలిపారు.

ఎన్‌సీసీ సౌకర్యాల తనిఖీ

రాయదుర్గం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాండెట్లకు సౌకర్యాలను కమాండింగ్ ఆఫీసర్ మౌనిస్‌సుబా ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం కళాశాలకు చేరుకుని ఎన్‌సీసీ క్యాండెట్లకు ఏర్పాటు చేసిన ఓటీ ట్రాక్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఎన్‌సీసీకి అవసరమైన సౌకర్యాలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా ఎంపికైన ఎన్‌సీసీ క్యాండెట్లను అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ గోవర్ధన్, పీడీ ప్రశాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.